క్లుప్తంగా

బాలింతలు పౌష్టికాహారం తీసుకోవాలి

నింద్ర: బాలింతలు, కిషోర బాలికలు ప్రతి నిత్యం విధిగా పౌష్టికాహారం తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్యామల అన్నారు. బుధవారం మండలంలోని కావునూరు అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహారంపై అవగాహన కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలింతలు, కిషోర బాలికలు ఆహారం తీసుకునే విధానాలు, పరిసరాలు పరిశుభ్రత, ఆహార శుభ్రత చిరుధాన్యాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆకస్మిక తనిఖీ



సచివాలయాల రికార్డులను తనిఖీ చేస్తున్న ఎంపీడీఓ సతీష్

గంగాధరనెల్లూరు: మండలంలోని ముక్కలత్తూరు, గంగాధరనెల్లూరు గ్రామ సచివాలయాలను ఎంపీడీఓ సతీష్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన సచివాలయ సిబ్బందికి పలు సూచనలు జారీ చేశారు. ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తులు, అధికారిక కార్యకలాపాలకు సంబంధించిన రికార్డులను సక్రమంగా నిర్వహిస్తున్నారా ? లేదా ? అని పరిశీలించారు. అనంతరం బయోమెట్రిక్ హాజరును పరిశీలించారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శులు కిరణ్ కుమార్, చంద్ర ఉన్నారు.

ప్రతి గ్రామంలో స్వచ్ఛభారత్

నింద్ర: మండలంలో ప్రతి గ్రామంలో స్వచ్ఛ భారత్ కార్యక్రమాలు చేపట్టాలని మండల ఎంపీడీఓ శివప్రసాద్‌వర్మ తెలిపారు. బుధవారం మండలంలోని ఇరుగువాయి గ్రామంలో స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి నెలా మూడో శనివారం స్వచ్ఛభారత్ కార్యక్రమాలు పంచాయతీల్లో చేపట్టాలని అన్నారు. నేడు ప్రభుత్వ కార్యాలయాల్లో చేపట్టినట్లు తెలిపారు. ప్రతి పంచాయతీ కార్యాలయంలో అవగాహన కల్పించారు. ప్రతి గ్రామంలో పరిశుభ్రంగా ఉంచుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సర్పంచ్, కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతగా పని చేయండి



ప్రాథమిక పాఠశాలలో వెంకటరమణ

పాలసముద్రం: మండల స్థాయి అధికారులు బాధ్యతగా పని చేయాలని మండల ప్రత్యేక అధికారి వెంకట రమణ తెలిపారు. బుధవారం ఆయన మండలంలోని ఆముదాల, పాలసముద్రం సచివాలయాలు, పీహెచ్‌సీలు, శ్రీబొమ్మరాజుపురం ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సచివాలయ ఉద్యోగులు ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. పీహెచ్‌సీకి వచ్చే రోగులతో స్నేహభావంతో మెలగాలని ఆరోగ్య సిబ్బందికి సూచించారు. శ్రీబొమ్మరాజుపురం ప్రాథమిక పాఠశాలల్లో గతంలో కూలిపోయిన భవనాన్ని పరిశీలించారు. అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే సరుకులను లబ్ధిదారులకు అందించాలన్నారు. అనంతరం ఆయన కార్యాలయాల నిర్వహణకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు అన్బళగన్, సర్పంచ్ అయ్యప్ప, ఎంపీడీఓ కృష్ణమహేష్ రెడ్డి, ఎంఈఓ గిరిజ, వైద్యాధికారి మోహన్‌కృష్ణ, హెచ్ఎం వెంకటేష్, పంచాయతీ కార్యదర్శి సత్యానారాయణ, మండల విస్తరణాధికారి రమేష్, సీఆర్పీలు శరవణన్, మునిరాజ్, రాజేశ్వరి, మహాలక్ష్మి పాల్గొన్నారు.

వివాహ రిజిస్ట్రేషన్ విఫలం



వివాహం అన్ని విషయాలలో ఘనమైనది, పవిత్రమైనది. అందుకే పట్టణాలలో వివాహమైన వెంటనే రిజిస్ట్రేషన్ నమోదు చేస్తారు. ఈ విధానం గ్రామీణ ప్రాంతాల్లో కూడా అమలు కావాలన్న లక్ష్యంతో 2012 సంవత్సరంలో వివాహ నమోదు కార్యక్రమం తీసుకొచ్చారు. క్షేత్రస్థాయిలో గ్రామీణులకు అవగాహన కల్పించి, పంచాయతీల్లోనే వివాహ రిజిస్ట్రేషన్ జరిగేలా అధికారులు చర్యలు తీసుకోవాలి. అయితే ఈ విధానం నియోజకవర్గ పరిధిలో ఎక్కడ అమలు కావడం లేదు. కనీసం ప్రజలకు అవగాహన కల్పించడంలో కూడా అధికారులు విఫలమయ్యారు. ఫలితంగా అక్కడక్కడా గుట్టుచప్పుడు కాకుండా బాల్య వివాహాలు జరిగిపోతున్నాయి.

–విజయపురం

- గ్రామాల్లో వివాహ రిజిస్ట్రేషన్ల నమోదు శూన్యం
- అవగాహన కల్పించడంలో అధికారుల వైఫల్యం
- జోరుగా బాల్య వివాహాలు

నగరి నియోజకవర్గ వ్యాప్తంగా ఐదు మండలాల్లో 90 సచివాలయాలు, 400 పైగా గ్రామాలు ఉన్నాయి. ప్రతి ఏటా వందకు పైగా వివాహాలు జరుగుతున్నాయి. కానీ పంచాయతీల్లో ఎక్కడగానీ రిజిస్ట్రేషన్ జరగడం లేదు. దీంతో గ్రామీణ ప్రాంతాల్లో జరుగుతున్న బాల్య వివాహాలకు అడ్డుకట్ట వేయలేకపోతున్నారు. గ్రామాల్లో బాల్య వివాహాలు జరగకుండా అరికట్టేందుకు గ్రామాల్లో వివాహ రిజిస్ట్రేషన్ ప్రక్రియ తీసుకొచ్చారు. దీని కోసం మండల స్థాయిలో ఓ కమిటీ కూడా ఏర్పాటు చేశారు. ఇందులో ఐసీడీఎస్ సీడీపీఓ, తహసీల్దార్, ఎంపీడీఓ, మహిళ పోలీసులతో పాటు, ఎస్ఐ, వైద్యాధికారులు సభ్యులుగా ఉంటారు. ప్రధానంగా మహిళ పోలీస్‌తోపాటు ఐసీడీఎస్ సిబ్బంది బాల్య వివాహాలపై నిఘా పెట్టాలి. ఓ బాల్య వివాహం కానీ వారు ఫిర్యాదు చేస్తేనే స్పందిస్తున్నారు. వివాహ నమోదు కార్యక్రమం పటిష్టంగా అమలైతే బాల్య వివాహాలకు కొంతమేర అడ్డుకట్ట వచ్చునని నిపుణులు అంటున్నారు.

రిజిస్ట్రేషన్ ఇలా..

జీఓ నంబరు 193 ప్రకారం ప్రతీ పంచాయతీలో వివాహ నమోదును ఆయా గ్రామ కార్యదర్శులు చేయాలి. ఇందులో భాగంగా ముందుగా వరుడు, వధువు ఆధార్ కార్డులు, వయసు ధ్రువీకరణ పత్రాలు, పెళ్లికార్డు, వ్యక్తిగత, పెళ్లి ఫొటోలు, ఇద్దరు సాక్షులు సంతకాలు, వారి ఆధార్‌కార్డులు సమర్పించాలి. వీటిని పరిశీలించి పంచాయతీ కార్యదర్శి వివాహ రిజిస్ట్రేషన్ ధ్రువీకరణ పత్రాన్ని అందజేశారు. పెండ్లి అయిన 20రోజుల్లోపు దరఖాస్తు చేసుకోవాలి. ఆ తరువాత కంప్యూటర్ ద్వారా ధ్రువపత్రం అంజేశారు.

నిఘా పెడుతున్నాం

"పెళ్లి సీజన్ వస్తే బాల్య వివాహం జరగకుండా తగు జాగ్రత్తలు తీసుకొంటున్నాం. ఎక్కడ గానీ బాల్య వివాహం జరుగుతున్నట్లు తెలిస్తే వెంటనే వెళ్లి తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్నాం. బాల్య వివాహం జరగకుండా తగు అన్ని జాగ్రత్తలు తీసుకొంటున్నాం."

– కృష్ణమంజరి, సీడీపీఓ, నగరి

ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి

"వివాహ నమోదు కార్యక్రమం చాలా మంచిది. ఇటీవల ప్రజలకు అవగాహన కల్పించాం. పంచాయతీ కార్యదర్శులు తప్పనిసరిగా అమలు చేయాలని హెచ్చరిస్తున్నాం. ప్రజలు కూడా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరుతున్నాం."

–రాజేంద్ర, ఎంపీడీఓ, విజయపురం

భూసారం ఆధారంగా ఎరువులు వాడాలి

నింద్ర: మండలంలోని రైతులు తమ పొలాల్లో భూసార పరీక్షలు చేసి వాటి ఆధారంగా ఎరువులు వాడాలని మండల వ్యవసాయాధికారి తులసీరాం అన్నారు. మండల కేంద్రమైన నింద్రలోని వ్యవసాయ కార్యాలయంలో రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు తమ పొలంలో భూసార పరీక్షలు చేయించి లోపాలను గుర్తించి, కావాల్సిన పోషకాలను వాడాలని సూచించారు. రైతులు ప్రకృతి వ్యవసాయం ఆధునిక వ్యవసాయ పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

నేడు గురు సంక్రమణ పూజలు

నగరి: శ్రీకామాక్షీ సమేత కరకంఠేశ్వర స్వామివారి ఆలయంలో గురువారం గురు సంక్రమణ పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్త సుబ్రమణ్యం ఒక ప్రకటనలో తెలిపారు. గురు భగవానుడు వృషభ రాశి నుండి మిథునరాశికి సంక్రమించడాన్ని పురస్కరించుకొని గురువారం ఉదయం 9 గంటల నుంచి ఆలయంలోని దక్షిణామూర్తి ప్రాకారం వద్ద సంక్రమణ పూజలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. మేషం, కర్కాటకం, కన్య, వృశ్చికం, మకరం, మీన రాశులవారు పరిహారం చేసుకోవాలన్నారు.

నూతన వధూవరులకు ఆశీర్వాదం



డీఎం పురంలో వధూవరులను ఆశీర్వదిస్తున్న మాజీ ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి

కార్వేటినగరం: మండల పరిధిలోని డీఎం పురం గ్రామానికి చెందిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు భాస్కర్ కుమార్తె సంధ్యకు బుధవారం అదే గ్రామంలోని చర్చిలో జరుగుతున్న వివాహ వేడుకలను ముఖ్య అతిథిగా మాజీ ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి హాజరయ్యారు. అనంతరం వధూవరులను ఆశీర్వదించారు. ఆయన వెంట నియోజకవర్గం ఎస్సీ సెల్ కార్యదర్శి వెంకటరత్నం, వైఎస్సార్‌సీపీ నాయకులు హడ్వర్డ్, రవి, చంద్రయ్య, రమేష్ పలువురు నాయకులు, మహిళలు ఉన్నారు.

ముగిసిన ముత్తిగంగమ్మ జాతర



ప్రత్యేక అలంకరణలో ముత్తి గంగమ్మ



అమ్మవారికి పూల మాలల సమర్పణ

పెనుమూరు(కార్వేటినగరం): పెనుమూరు మండలంలోని ఉగ్రాణంపల్లిలో ముత్తిగంగమ్మ జాతర బుధవారం వైభవంగా ముగిసింది. మంగళవారం రాత్రి గ్రామ ఊరేగింపు అనంతరం అమ్మవారిని ఆలయ ఆవరణలో కొలువుదీర్చారు. గ్రామ పెద్ద రాజశేఖర్‌రెడ్డి తెరతీసి తొలి పూజ నిర్వహించారు. అనంతరం భక్తులు అమ్మవారికి దర్శనానికి పోటెత్తారు. మహిళలు అమ్మవారికి అంబలి పోసి మొక్కులు తీర్చుకున్నారు. మధ్యాహ్నం అమ్మవారికి ప్రత్యేక వాయిద్యాల నడుమ గెండి దీపాలతో పాటు కుంభకూడు సమర్పించారు. సంతానం లేని వారు అమ్మవారి ఆలయం చుట్టూ పొర్లు దండాలు పెట్టి మొక్కులు తీర్చుకున్నారు. అలాగే ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేపట్టారు. రాత్రి అమ్మవారిని గ్రామ వీధుల్లో ఊరేగిస్తూ జల్దికి తరలించడంతో జాతర ముగిసింది. కార్యక్రమంలో సర్పంచ్ మురళీకుమార్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, కనకరాజారెడ్డి, ధనంజయరెడ్డి, రామచంద్రారెడ్డి, పవన్‌కుమార్, ప్రవీణ్, రాజేష్, చక్రి, ధీరజ్‌రెడ్డి, రమణారెడ్డి, దేవి పలువురు పాల్గొన్నారు.







ముడిపల్లిలో కొలువుదీరిన గంగమ్మ, కరకంఠాపురంలో గంగమ్మ, కీళపట్టులో గంగమ్మ, పొన్నెమ్మ

గంగమ్మ తల్లీ.. దండాలు

- పలు గ్రామాల్లో భక్తిశ్రద్ధలతో గంగ జాతర
- మొక్కులు తీర్చుకున్న భక్తులు



నెత్తంకండ్రిగలో ప్రత్యేక అలంకరణలో గంగమ్మ



కరకంఠాపురంలో వేపాకు సారె సమర్పణకు క్యూలో భక్తులు



అమ్మవారి అభిషేకానికి పవిత్ర జలం ఊరేగింపు

నగరి: మున్సిపల్ పరిధిలోని కీళపట్టు, నెత్తం కండ్రిగ ప్రాంతాల్లో, రూరల్ మండలంలోని ముడిపల్లి, వీకేఆర్‌పురం, గుడికండ్రిగ, మిట్టపాళెం, మూలనత్తం, ఎం.కొత్తూరు గ్రామాల్లో బుధవారం గంగమ్మ జాతర వైభవంగా నిర్వహించింది. తిరుపతి జాతరతోపాటు ఈ ప్రాంతాల్లో జాతర నిర్వహించడం ఆనవాయితీ. కీళపట్టులో మంగళవారం రాత్రి పొన్నెమ్మ, గంగమ్మను ఊరేగింపుగా తెచ్చి వేపాకు గుడిసెకు చేర్చారు. నెత్తం కండ్రిగలో గంగమ్మను ప్రత్యేక అలంకరణలో ఊరేగింపుగా తీసుకురాగా అలంకరణ భక్తులను ఆకట్టుకుంది. ముడిపల్లి గ్రామంలో తొలుత చలపరమ్మను ప్రత్యేక అలంకరణలో గ్రామ ప్రదక్షిణ చేసి ఆలయానికి చేర్చారు. అనంతరం చలపరమ్మ మాలను తీసుకెళ్లి గంగమ్మకు అలంకరించి భక్తజన సందోహం మధ్య ఊరేగింపుగా తెచ్చి ఊరి మధ్యలోని వేపాకు గుడిసెకు చేర్చారు. కరకంఠాపురంలో జాతరను పురస్కరించుకొని ఏకాంబరకుప్పం రైల్వే స్టేషన్ సమీపం నుండి భక్తులు అభిషేక జలాన్ని ఊరేగింపుగా తీసుకెళ్లడం ప్రత్యేకతను సంతరించుకుంది. ఆ జలంతో అమ్మవారికి అభిషేకం చేశారు. గ్రామాల్లో గంగమ్మ ఊరేగింపును పురస్కరించుకొని ఏర్పాటు చేసిన వీధి నాటకాలు, నృత్యాలు స్థానికులను అలరించాయి. మహిళలు అధిక సంఖ్యలో అమ్మవారికి చీరలు సమర్పించి, మొక్కులు తీర్చుకున్నారు. వేపాకు సారెలు, వెయ్యి కన్నుల దుత్తల్లో దీపాలు సమర్పించారు. తడిబట్టలతో అంగప్రదక్షిణ చేశారు. వేపాకు సారెలు సమర్పించడానికి సుమారు 700 మంది క్యూలైన్‌లో నిలబడడం ప్రత్యేకతను సంతరించుకుంది. కుటుంబ సమేతంగా వచ్చిన భక్తులు గంగమ్మ నైవేద్యం సమర్పించి, కర్పూర హారతులు స్వీకరించారు. బలిఅన్నం సమర్పించి రాత్రి గంగమ్మను డప్పు వాయిద్యాల నడుమ ఊరేగింపుగా తీసుకెళ్లి పొలిమేర దాటించారు.

ఆయిల్‌పామ్‌తో అధిక లాభాలు





శిక్షణా కార్యక్రమంలో మాట్లాడుతున్న జిల్లా ఉధ్యానవన అధికారి, సమావేశానికి హాజరైన రైతులు

- మొక్కలు ఉచితంగా అందిస్తాం
- సాగుకు రూ.20 వేల నుంచి 29 వేల వరకు సబ్సిడీ
- అంతర పంటకు రూ.10500 సబ్సిడీ
- జిల్లా ఉద్యానవన అధికారి మధుసూదన్ రెడ్డి

నగరి: ఆయిల్‌పామ్ సాగుతో అధిక లాభాలు పొందవచ్చని జిల్లా ఉద్యానవన శాఖ అధికారి మధుసూదన్‌రెడ్డి అన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలోని వెలుగు కార్యాలయంలో ఆయిల్‌పామ్ సాగులో మేలైన యాజమాన్య పద్ధతులపై ఆయన శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయిల్ పామ్‌ను నీరు ఇంకే ఏ నేలలోనైనా సాగు చేసుకోవచ్చన్నారు. మొక్కలను 9–9–9 అనే త్రిభుజాకార పద్ధతిలో నాటుకోవాలన్నారు. 14 నుంచి 18 నెలలకు పూతకు వస్తుందని రెండున్నరేళ్ల వరకు పూతను తీసివేయాలన్నారు. నాలుగో సంవత్సరం నుండి దిగుబడి ప్రారంభమవుతుందని, 30 ఏళ్ల వరకు దిగుబడి వస్తుందన్నారు. ఈ సాగులో కోకో అనే పంటను అంతరపంటగా వేసుకోవచ్చన్నారు. గోద్రేజ్ ఆయిల్ పామ్ కంపెనీ నగరి, విజయపురం మండలాలకు మేలురకం మొక్కలను ఉచితంగా అందిస్తుందన్నారు. పంట సాగుకు రూ.20 నుంచి 29 వేలు సబ్సిడీ అందిస్తామన్నారు. అంతర పంట నిర్వహణకు రూ.10500 సబ్సిడీ అందిస్తామన్నారు. గోద్రేజ్ డీజీఎం మురళి మాట్లాడుతూ రైతులకు నాణ్యతతో కూడిన మొక్కలను ఉచితంగా అందిస్తామన్నారు. అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఆయిల్‌పామ్ సాగు చేసి, లాభాలు పొందాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి రాఘవేంద్రయాదవ్, గంగాధర నెల్లూరు ఉద్యానవన అధికారి లోకేష్, రైతు సేవాకేంద్రం సిబ్బంది నాగరాజు, శోభ, ప్రేమ్, ఉదయ్, రేష్మ, లయశ్రీ, రైతులు పాల్గొన్నారు.

దుస్థితిలో అంతర్గత రోడ్లు





అధ్వానంగా ఓబీఆర్‌కండ్రిగ అంతర్గత రోడ్డు, గుంతలమయంగా ఉన్న తిరుమండ్యం అంతర్గత రోడ్డు

- మరమ్మతులకు నోచుకోని ఓబీఆర్ కండ్రిగ, తిరుమండ్యం రోడ్లు

వడమాలపేట(విజయపురం): వడమాలపేట మండలం వసంతనగర్ నుంచి ఓబీఆర్‌కండ్రిగ మీదుగా వడమాలపేట వెళ్లే అంతర్గత రోడ్డు అధ్వానంగా మారింది. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వాహనదారులు సైతం గుంతల్లో పడి గాయాల పాలవుతున్నారు. గ్రామం, ప్రజలు లేని చోట రోడ్డు వేసే నాయకులకు మా రోడ్డు గుర్తుకు రాలేదా అంటూ ప్రశ్నిస్తున్నారు. మండలంలో కొందరు టీడీపీ నాయకులు తమ స్వార్థం కోసం తన సొంత ఊర్లకు రోడ్డు వేసుకొంటున్నారని, అవసరమైన చోట రోడ్డు వేయడం లేదని విమర్శలు గుప్పిస్తున్నారు. ఓబీఆర్ కండ్రిగ అంతర్గత రోడ్డు అధ్వానంగా ఉండడంతో సీతారామపురం, బలిజకండ్రిగ, వసంతనగర్, ఓబీఆర్‌కండ్రిగ, ఎస్టీ కాలనీ ప్రజలు తడుకు రైల్వేస్టేషన్ మీదుగా 8 కిలోమీటర్ చుట్టుకొని వడమాలపేట వెళ్లుతున్నారు. అప్లాయిగుంట నుంచి తిరుమండ్యం మీదుగా వడమాలపేట వచ్చే అంతర్గత రోడ్డు కూడా ఘోరంగా ఉంది. మండలంలో చాలా వరకు గ్రామీణ రోడ్డు దుస్థితి చేరింది. అయినా అధికారులు ఏ మాత్రం పట్టించుకోవడం లేదు. కేవలం నాయకులకు దోచిపెట్టడానికి వారికి అనువైన చోట రోడ్డు వేసుకొని లాభం పొందుతున్నారని మండలంలో విమర్శలు గట్టిగా వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రజలకు అవసరమైన వాటిని దృష్టి పెట్టి, గ్రామాభివృద్ధికి సహకరించాలని కోరారు.

వైభవంగా గంగమ్మ నిమజ్జనం





నిమజ్జనానికి తరలుతున్న గంగమ్మ ప్రతిమ, ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

గంగాధరనెల్లూరు: జీడీనెల్లూరు, వేల్కూరు, రామానాయుడుపల్లి, పెద్ద కాల్వ గ్రామాల్లో గంగమ్మ జాతర ఘనంగా జరిగింది. బుధవారం అమ్మవారి నిమజ్జనాన్ని గ్రామస్తులు అట్టహాసంగా నిర్వహించారు. గంగమ్మకు నైవేద్యం సమర్పించారు. అనంతరం అమ్మవారిని విశేష పుష్ప, విద్యుత్ అలంకరణలతో ఊరేగింపుగా నిమజ్జనానికి తలరించారు. జీడి నెల్లూరు మండల కేంద్రంలో అమ్మవారి అలంకరణలో నృత్య ప్రదర్శన, మహిళా డప్పు కళాకారుల ప్రదర్శన స్థానికులను ఆకట్టుకుంది.



ఆకట్టుకున్న మహిళా డప్పు కళాకారుల ప్రత్యేక ప్రదర్శన

అడుగుకో గుంత

- దుస్థితిలో ముడిపల్లి రోడ్డు
- ద్విచక్ర వాహనదారులకు చుక్కలు చూపిస్తున్న రోడ్డు



అధ్వానంగా ఉన్న నగరి-ముడిపల్లి రోడ్డు

నగరి: ప్రస్తుత పాలనతో గ్రామీణ రోడ్డు పూర్తిగా అధ్వానంగా మారాయి. ఆ రోడ్ల మీద ప్రయాణం చేయాలంటే ప్రజలు నరక యాతన అనుభవిస్తున్నారు. ప్రజలు తమ రాకపోకలు సాగించడానికి ప్రత్యామ్నాయంగా రోడ్లు లేకపోవడంతో తప్పదన్నట్లుగా గుంతలమయంగా మారిన రోడ్ల వెంబడి ప్రయాణం చేస్తున్నారు. ఏ మాత్రం కనురెప్ప మూసినా వారి పని అంతే అన్నట్లుగా రోడ్లు తయారయ్యాయి. బీటీ రోడ్లు గుంతలమయంగా మారిపోయాయి. బీటీ రోడ్లు కాదు మట్టి రోడ్ల మాదిరిగా కనిపిస్తున్నాయి.

నడక కూడా కష్టమే..

దుస్థితిలో మండలంలోని ముడిపల్లి మార్గంలోని రోడ్లు ఉన్నాయి. దీనికి తోడు ఈ మార్గంలో గ్రావెల్ టిప్పర్లు అధికంగా వెళుతుండడంతో రోడ్డు మరీ దారుణంగా తయారైందని స్థానికులు, వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నగరి పట్టణానికి 5 కిలోమీటర్ల దూరంలోనే ఈ గ్రామం ఉంది. అయినా అధికారులు ఎవరూ పట్టించుకోవడం లేదు. ఈ మార్గంలో మేళపట్టు, ముడిపల్లి, ఏడుగట్లు గ్రామాలకు వెళ్తుంటారు. వారందరూ నిత్యం ఈ రోడ్డు మీదుగానే ప్రయాణం సాగిస్తుంటారు. రోడ్డు మొత్తం గుంతలుగా ఉండడం, మలుపుల వద్ద సన్న కంకర, మట్టి పేరుకుపోవడంతో ఈ మార్గం వెంట వెళ్లాలంటే ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందో తెలియని పరిస్థితి నెలకొంది. రాత్రిళ్లు ఈ మార్గంలో ప్రయాణమంటే ప్రయాణికులకు చుక్కలు కనిపిస్తున్నాయి. అవసరానికి పట్టణానికి వెళ్లి ఏదైనా తెచ్చుకోవాలన్నా మార్గంలో వెళ్లేందుకు భయపడి వదిలేస్తున్నారు. నడుము నొప్పి, అనారోగ్యంతో ఉన్న వారు గ్రామానికే పరిమితమవుతున్నారు. అర అడుగుకు ఒక గుంత ఉందని ఒక్కసారి అధికారులు ఈ మార్గంలో వస్తే వారికే సమస్య అర్థమవుతుందని వాపోతున్నారు. అప్పుడైనా రోడ్డు సమస్య పరిష్కారమవుతుందని ఆశిస్తున్నారు. మండలానికి సమీపంలో ఉన్నా రోడ్డు మరమ్మతులు చేపట్టడం లేదని, ప్రభుత్వానికి అంత చిన్న చూపా అని అధికారులు, నాయకులను స్థానిక ప్రజలు విమర్శిస్తున్నారు.







సన్న కంకర, మట్టితో అధ్వానంగా ముడిపల్లి రోడ్డు

వేడుకగా అర్జున తపస్సు



అర్జున తపస్మాన్

గుడిపాల: మండలంలోని వసంతాపురంలో కొనసాగుతున్న మహాభారత ఉత్సవాల్లో భాగంగా బుధవారం అర్జున తపస్మాన్ కార్యక్రమం వేడుకగా సాగింది. శ్రీ వెంకటేశ్వర నాట్య కళామండలికి చెందిన అర్జున వేషధారి తపస్మాన్ చెట్టులోని మెట్టుకో పద్యం చెబుతూ అధిరోహించారు. సంతానం లేని మహిళలు తపస్సు మానువద్ద ఒరపడ్డారు. అర్జున వేషధారి తపస్సు మానుమీద నుంచి పూలు, నిమ్మకాయలు, వీబూది పండ్లు విసరడంతో వాటి కోసం భక్తులు ఎగబడ్డారు.